క్లుప్తంగా

పంచారామ క్షేత్రానికి పుణ్య నదీ జలాలు


పుణ్య నదీ జలాలను తీసుకొస్తున్న ఈఓ, పండితులు

సామర్లకోట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న లింగోద్భవకాల అభిషేకాలు చేయడానికి దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పుణ్యనదీ జలాలు గురువారం సాయంత్రం సామర్లకోట పంచారామ క్షేత్రానికి చేరాయి. జలాలను తీసుకొచ్చిన వేద పండితులకు ఈఓ బళ్ల నీలకంఠం పూర్ణకుంభ స్వాగతం పలికారు. గంగా, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరాధి, పుష్కరిణి, తుంగభద్ర, సింధు, ప్రణీత నదులకు చెందిన జలాలను తీసుకొచ్చినట్టు ఈఓ తెలిపారు. వీటిని భద్రపర్చి మహా శివరాత్రి రోజున స్వామివారికి వేద పండితులు అభిషేకం చేస్తారని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న వీరబాబు, సత్యానందం

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం అందిస్తున్న సేవలు అభినందనీయమని శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు అన్నారు. మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కేఎస్‌పీఎం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి మందిర నిర్వాహకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షత వహించారు. పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వారు సుమారు 200 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా 30 మందికి ఆపరేషన్లు చేయించనున్నట్లు సుదీప్ తెలిపారు.

శానిటరీ మేస్త్రీపై గుర్తు తెలియని వ్యక్తి దాడి


ఆందోళన చేస్తున్న కార్మికులు

పిఠాపురం: పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న శానిటరీ మేస్త్రీపై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటనలో బాధితుడికి న్యాయం చేయాలంటూ గురువారం స్థానిక మున్సిపాలిటీ మస్టరు కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, పిఠాపురం మున్సిపాలిటీలో శానిటరీ మేస్త్రీ పాట్యూరి పైడిరాజు బుధవారం మధ్యాహ్నం విధుల్లో ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తి అతనిపై దాడికి పాల్పడ్డాడు. పక్కనున్న కార్మికులు అడ్డుకునేందుకు యత్నించినా, ఆ వ్యక్తి ఆగకుండా దాడి చేయడంతో పైడిరాజుకు గాయాలయ్యాయి. ఇతర కార్మికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించాడని పైడిరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేయాలని, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మస్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పిఠాపురం రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పువారి సత్రం, టిడ్కో గృహ సముదాయం, పిఠాపురం రోడ్డులోని వ్యవసాయ బోర్లకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

జీబీఎస్ వ్యాధితో కండరాల రుగ్మత

కాకినాడ రూరల్: నాడీ వ్యవస్థను దెబ్బతీసే జీబీఎస్ వ్యాధి కండరాల రుగ్మత అని, ఇది వేగవంతంగా కండరాలపై ప్రభావం చూపుతుందని వైద్యుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, జీబీఎస్ వలన కండరాల బలహీనతతో పాటు, వెనుక భాగంలో నొప్పి, పాదాలు, చేతుల్లో నొప్పులు ప్రారంభమై శరీరం మొత్తానికి వ్యాపిస్తుందన్నారు. ఇది చాలా అరుదైన వ్యాధి అని, కలుషిత ఆహారం, నీటి వలన వస్తుందన్నారు. దీని నివారణకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు, తాజా పండ్లు, కాయగూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పార్వతి, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పట్నాయక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా సాగునా..!

- యూరియా కొరతతో రైతుల ఇక్కట్లు
- రైతు సేవా కేంద్రాల్లో అందని ఎరువు
- బ్లాక్ మార్కెట్‌లో రూ.350
- పొలాలకు అందని సాగునీరు


యూరియా వేయాల్సిన వరి చేను

సామర్లకోట: వరి పంట చేతికి వచ్చే తరుణంలో.. చేనుకు చేయూతనిచ్చే యూరియా లభించకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. మండలంలో 22,500 ఎకరాల్లో దాళ్వా సాగు జరుగు తుంది. గత సార్వాలో పంట చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాల కారణంగా రైతులు పంట నష్టపోయారు. ప్రస్తుతం వరి పంట గింజ పోసుకునే సమయంలో బలానికి అవసరమైన యూరియా వేయాల్సి ఉండగా, యూరియా గగనమైందని రైతులు వాపోతున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల్లో ప్రతి గ్రామంలోను ఎరువులు అందుబాటులో ఉండటంతో, కావాల్సిన సమయంలో తెచ్చుకునే వారమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రంగా మార్చినా, రైతుకు సేవ చేసే పరిస్థితి కనిపించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరకు..

రైతుల పరిస్థితిని గమనించిన దళారులు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తా రూ.275 ఉండగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.350కి విక్రయిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు రైతుల పరిస్థితి గమనించి కూడా ఏమీ చేయడం లేదని విమర్శిస్తున్నారు. స్థానిక సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో హోల్‌సేల్ గోదాములు ఉండటంతో, అక్కడి నుంచి భారీ మొత్తంలో దళారులు ఎరువులను కొనుగోలు చేసి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం వరి పంటకు యూరియా వేయకపోతే గింజ తయారయ్యే అవకాశం ఉండదని, దాంతో దిగుబడి తగ్గి రైతు తీవ్ర నష్టాలు తప్పవంటున్నారు. ఈ నేపథ్యంలో బ్లాక్ మార్కెట్‌లోనే ఎరువులను కొనుగోలు చేసి, చేలకు వేయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమైన చెక్ డ్యాం


వీకే రాయపురంలో శిథిలమైన రెగ్యులేటర్

స్థానిక వ్యవసాయ క్షేత్రం నుంచి వీకే రాయపురం సత్యవరపుపేట వద్ద ఉన్న చెక్ డ్యాం తొమ్మిదేళ్ల క్రితమే శిథిలమైంది. దాంతో వీకే రాయపురం రైతులకు సాగు నీరందని పరిస్థితి ఏర్పడింది. వీకే రాయపురం నుంచి రామేశ్వరం లో లెవెల్ చానల్ నుంచి అచ్యుతాపురత్రయం, రామేశ్వరానికి నీరు చేరుతుంది. చెక్ డ్యాం శిథిలం కావడంతో ఎగువ ప్రాంతాల భూములకు నీరందడం లేదని వీకే రాయపురం రైతులు వాపోతున్నారు. మూడు రోజులకు ఒకసారి వంతుల వారీ విధానంలో నీరివ్వడం, చెక్ డ్యాం శిథిలం కావడంతో సాగు నీటి సమస్య తప్పడం లేదు. చెక్ డ్యాం మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయని ఆరేళ్లుగా అధికారులు చెబుతున్నా, పనులు మాత్రం చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

అధిక ధరకు యూరియా



యూరియా బస్తా రూ.275కి విక్రయించాల్సి ఉండగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. వారం రోజులుగా రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేదు. ప్రస్తుత వరి చేలకు యూరియా ఎంతో అవసరం. వెంటనే యూరియాను అందుబాటులో తేవాలి.

– వల్లూరి వెంకన్నబాబు, రైతు, సామర్లకోట

60 టన్నులు ఆర్డర్ పెట్టాం



రైతు సేవా కేంద్రాల్లో యూరియా ఉండేలా 60 టన్నులు ఆర్డర్ పెట్టాం. సేవా కేంద్రాల నుంచి ఎరువులను రైతులు అరువుకు తీసుకెళుతున్నారు. దాంతో కొంత మేరకు సమస్య ఏర్పడుతుంది. గతంలో వచ్చిన స్టాక్‌కు సంబంధించి జమ చేస్తేనే, అదనంగా ఎరువులు వస్తాయి. శుక్రవారం నాటికి స్టాక్ ఏర్పాటు చేస్తాం.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- విద్యా శాఖ ఏడీ వినయ్ మోహన్


మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీ వినయ్ మోహన్

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తప్పవని విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.వినయ్‌మోహన్ స్పష్టం చేశారు. స్థానిక జేఎన్ మున్సిపల్ హైస్కూల్, వీరేశలింగం ప్రైమరీ పాఠశాలలో గురువారం ఆయన మధ్యాహ్న భోజన పథకం తీరును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ వినయ్‌మోహన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులతో పాటు, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలతో భోజనాన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేయాలన్నారు. నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థుల మరుగు దొడ్లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ చౌదరి, ప్రకాష్ తదితరులున్నారు.

మహా శివరాత్రికి డ్రోన్లతో ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ బిందు మాధవ్
- పాదగయ క్షేత్రంలో ఏర్పాట్ల పరిశీలన


పాదగయ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

పిఠాపురం: రానున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఆయన గురువారం పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాదగయ క్షేత్రానికి ఈ ఏడాది లక్ష మంది భక్తులు వస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. సుమారు 70 వేల మంది దర్శనానికి వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో జరిగిన ఉత్సవాలు, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన స్వల్ప తప్పిదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైతే అధిక భక్తుల తాకిడి ఉండే పిఠాపురం, సామర్లకోట ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. క్యూలైన్ల ఏర్పాటు, లోపలికి, బయటకు దారుల ఏర్పాట్లు తదితర వాటిపై అధికారులకు సూచనలు ఇస్తున్నామన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడి దానికి తగ్గట్టుగా ప్రస్తుతం అధికారులకు సూచనలు ఇస్తున్నామన్నారు. భక్తులు పిండ ప్రదానాలు, దర్శనం, పుణ్యస్నానం చేసుకుని సురక్షితంగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఆలయాల వద్ద జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసు సిబ్బందితో పాటు, భక్తుల సహకారం తీసుకుంటామన్నారు. భక్తులు పాటించాల్సిన సూచనలు, నిబంధనలను మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కంట్రోల్ రూం, తగినన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బారికేడ్ల ఏర్పాటు, పార్కింగ్ తదితర విషయాలపై స్థానిక సీఐ జి.శ్రీనివాస్‌తో చర్చించారు. ఇతర ఏర్పాట్లపై ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్‌ను అడిగితెలుసుకున్నారు. ఈయన వెంట ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్సై మణికుమార్ తదితరులున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు

- పంచారామ క్షేత్రాన్ని పరిశీలించిన ఎస్పీ

సామర్లకోట: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పంచారామ క్షేత్రంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ నెల 24 నుంచి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 24న రాత్రి స్వామివారి కల్యాణం, 26న మహా శివరాత్రి, 27న రథోత్సవం ఉంటుందని ఈఓ బళ్ల నీలకంఠం ఎస్పీకి వివరించారు. అవుట్ గేటు నుంచి ఎవరూ రాకుండా చేస్తే ఆలయంలో భక్తులకు ఇబ్బంది ఉండదని ఈఓ ఆయనతో చెప్పారు. ఉచిత, రూ.20, రూ.100 క్యూలైన్లు, ఆలయ కోనేరు, గోదావరి కాలువలో భక్తులు స్నానాలు చేసే రేవు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులను ఎస్పీ పరిశీలించారు. వీఐపీలు స్వామివారిని దర్శించుకునే విధానాన్ని ఎస్పీ తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ, గతేడాది లోపాలను సరిదిద్దుకుంటూ, సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. ఆయన వెంట సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు ఉన్నారు. తొలుత


సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

ఎస్పీకి ఆలయ మర్యాదలతో ఈఓ స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, పెద్ద నంది, మూలవిరాట్‌ను ఎస్పీ దర్శించుకున్నారు. శివలింగానికి అభిషేకం చేశారు.

మొక్కుబడిగా వాహనాల పార్కింగ్ పనులు


ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద అసంపూర్తిగా తొలగించిన మట్టి

సామర్లకోట: మహా శివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి నిర్దేశించిన స్థలాన్ని శుభ్రం చేసే పనులు మొక్కుబడిగా జరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలో కెనాల్ రోడ్డులోని మాండవ్య నారాయణ స్వామి ఆలయానికి వెళ్లే కాలిబాట వంతెన ఎదురుగా ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ చేసేలా మున్సిపాలిటీ శుభ్రం చేయాలని ఇటీవల ఉత్సవ అధికారుల సమీక్షలో నిర్ణయించారు. ఆ ప్రదేశంలో ఉన్న మట్టిని పూర్తిగా తొలగించకపోవడం వల్ల వాహనాలను ఎలా పార్కింగ్ చేస్తారంటూ పలువురు విమర్శిస్తున్నారు. కొంత మేరకు మట్టిని లెవెలింగ్ చేసి, కొంతభాగం వదిలేశారు. దాంతో పార్కింగ్‌కు ఇబ్బందిగా మారే అవకాశం ఉందంటున్నారు. మున్సిపల్ అధికారులు స్వయంగా ఆ ప్రదేశాన్ని పరిశీలించి, రోడ్డుకు సమానంగా మట్టిని తొలగించాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు సూచిస్తున్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం


సామర్లకోట తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద జరుగుతున్న కల్వర్టు పనులు

సామర్లకోట: పట్టణంలోని బలుసులపేట తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద కల్వర్టు పనులు ప్రారంభించారు. ఈనెల 17వ తేదిన 'సాక్షి'లో 'ప్రమాదకరంగా కల్వర్టులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పట్టణ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. ఈ కల్వర్టు నిర్మాణానికి కౌన్సిల్ నిధులు మంజూరు చేయడం, టెండర్లు పిలిచారు. టెండరు ఖరారైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. దాంతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో, వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ శెట్టిబత్తుల దుర్గారావును మున్సిపల్ ఏఈ రమేష్‌బాబు సూచించారు. ఈ క్రమంలో కల్వర్టు పనులు జోరుగా సాగుతున్నాయి. ఎనిమిదేళ్లుగా నెలకొన్న సమస్యకు మోక్షం లభించడంతో పాఠశాల విద్యార్థులతో పాటు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్చి 6న చలో విజయవాడ

- ఏఐటీయూసీ నేత మధు


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మధు తదితరులు

సామర్లకోట: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కార్మికుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ పేరుతో దళారులు లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపుఇచ్చామన్నారు. మార్చి 3 వరకూ దశలవారీ ఆందోళనలు చేస్తామన్నారు. ఈ నెల 24న కాకినాడ నగరపాలక సంస్థ, మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కిషోర్, పెదిరెడ్ల సత్యనారాయణ, కె.బోడకొండ, బొచ్చా శ్రీను, మల్లిపూడి లక్ష్మి, వరలక్ష్మి, అజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలు మండలం దుర్గాడలో చిల్లీ స్పెషల్ కషాయం తయారు చేస్తున్న మహిళలు

వంటకు కాదు పంటకు..

పిఠాపురం: మహిళలందరూ కూర్చుని కూరగాయలు తరుగుతుంటే.. ఏదో శుభకార్యానికి వంట సిద్ధం చేస్తున్నారనుకుంటే పొరబాటే. వంట కోసం కాదు వాటిని సిద్ధం చేస్తున్నది పంట కోసం. పంటలపై తెగుళ్ల నివారణ కోసం పంటపై పిచికారీ చేయడానికి సేంద్రియ పద్ధతిలో వారు కషాయం తయారు చేస్తున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- పీఆర్ఆర్డీ అసిస్టెంట్ కమిషనర్


డిజిటల్ అసిస్టెంట్లకు సర్టిఫికెట్లు ఇస్తున్న కృష్ణమోహన్, ప్రొఫెసర్లు

సామర్లకోట: సాంకేతిక శిక్షణను డిజిటల్ అసిస్టెంట్లు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అధికారులు ఇచ్చిన శిక్షణ ద్వారా మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ రవిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వర్, ఈటీసీ ఫ్యాకల్టీలు డీఆర్ఎన్ పద్మ, ఎస్‌కే మొహిద్దీన్ పాల్గొన్నారు.

రిబ్బన్లు కడితే చాలా!


మఠం సెంటర్‌లో కూల్చివేసిన కల్వర్టు వద్ద కట్టిన రిబ్బన్లు

సామర్లకోట: పట్టణంలోని మఠం సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు వద్ద అధికారులు రిబ్బన్లు కట్టి చేతులు దులుపుకొన్నారు. అజాగ్రత్తగా ఉంటే అంతే సంగతులు.. అనే శీర్షికతో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు కల్వర్టుకు అడ్డుగా రిబ్బన్లు ఏర్పాటు చేశారు. డ్రైన్లలో పూడికతీత పనుల్లో భాగంగా మఠం సెంటర్ అంబటి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కల్వర్టును కూల్చివేశారు. రోడ్డు మార్జిన్‌లో కూల్చివేసిన కల్వర్టుకు రెయిలింగ్ లేకపోవడంతో, ఆ రోడ్డులో ప్రయాణించే వారు, ఆయా షాపుల వద్ద కూల్చివేసిన కల్వర్టును గమనించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ కల్వర్టు నిర్మాణానికి గత నెలలో కౌన్సిల్ సమావేశంలో నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా టెండర్లు పిలవలేదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. పనులు ప్రారంభించే వరకు కూల్చివేసిన కల్వర్టు వద్ద డివైడర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

కొత్తపల్లి: గ్రామంలో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పాలని దొరబాబు అన్నారు. ఫాగింగ్ మెషీన్ల ద్వారా వాకతిప్ప గ్రామంలో గురువారం పంచాయతీ సిబ్బందితో దోమల నిర్మూలన మందును పిచికారీ చేయించారు. గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టామని, ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు.

శతాబ్ది వేడుకను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పద్మరాఘవరావు

సామర్లకోట: పట్టణంలోని బ్రౌన్‌పేటలో పిఠాపురం రాజా రావు జగపతి సూర్యారావు బహదూర్ ఆధ్వర్యంలో 30 ఎకరాల స్థలంలో 1924లో స్థాపించిన హైస్కూల్ శతాబ్ది వేడుకను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు పసల పద్మరాఘవరావు తెలిపారు. గురువారం స్థానిక గ్రంథం రామకృష్ణ కాన్వెంట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రారంభంలో ఉన్న జెడ్పీ హైస్కూల్ నుంచి ప్రభుత్వ హైస్కూల్, ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మారిందన్నారు. 2024కు హైస్కూల్ ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి కావడంతో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. అప్పటి పాఠశాల, కళాశాల విద్యార్థులతో ఆత్మీయ సమేశనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దేశ, విదేశాల నుంచి సుమారు వెయ్యి మంది హాజరవుతారని చెప్పారు. శిథిల స్థితికి చేరిన కళాశాల భవనం కోసం కలెక్టర్, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు, సంఘపరంగా సాయం చేస్తామని తెలిపారు. ఉన్నత పదవుల్లో పదవీ విరమణ చేసిన పూర్వ విద్యార్థులను సత్కరిస్తామని దవులూరి సుబ్బారావు తెలిపారు.

24న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 24వ తేదీన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

భీమేశ్వరుని సన్నిధిలో సంగీత దర్శకుడు రామాచారి


సామర్లకోట పంచారామ క్షేత్రంలో రామాచారి దంపతులు

సామర్లకోట: సినీ సంగీత దర్శకుడు, సినీ గాయకులు కోమండూరి రామాచారి దంపతులు గురువారం స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరీదేవిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ పండితులు ఆ దంపతులకు ఆశీర్వచనాలు, ఈఓ నీలకంఠం స్వామివారి ప్రసాదం అందజేశారు. వీరి వెంట స్థానిక కళాకారులు బడుగు బాబి, చీమలకొండ వీరభద్రప్రసాద్, గిడుతూరి శ్రీనివాసు ఉన్నారు.